క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి బుధవారం ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన బోనంతో డప్పువాయిద్యాల నడుమ ర్యాలీగా పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. మేకలను, గొర్రెలను బలిఇచ్చారు. వేడుకలకు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ హాజరై మొక్కులు చెల్లించారు.

మడేలయ్య పండుగ



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలో రజకులు మడేలయ్య పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. రజకులు మడేలయ్య పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కుల పెద్దలు చాగంటి రాజు, సంగెం రామచంద్రు, లక్ష్మీనర్సు, సంగెం చంద్రయ్య, కొమ్మలు, అశోక్, సుధాకర్, శివకోటి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కాల్ నాయక్ తండాలో జర్పుల తారోని ఇంటి కప్పు కూలిపోగా బాధిత కుటుంబానికి పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్, గుగులోతు నరేశ్, యువకులు బుధవారం రూ.3,500 నగదు అందజేశారు. తారోనీకి ప్రభుత్వం సాయం అందించాలని వారు కోరారు. తారోనీని పరామర్శించారు.

దివ్యాంగురాలి అంత్యక్రియలకు..



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లికి చెందిన దివ్యాంగురాలు బీసుపాక కల్యాణి బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా రూ.4 వేల సాయం అందజేశారు. తొలుత కల్యాణి మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించి సాయం అందించినట్లు రాజేశ్ ఖన్నా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోసెఫ్, తూళ్ల అనిల్, సైదులు, కుమారస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు చెంగల ఇందిరను ఆమె సోదరి నిర్మల మృతి చెందిన క్రమంలో మాజీ మంత్రి దయాకర్‌రావు పరామర్శించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని చెప్పారు. ఆయన వెంట నాయకులు బొడ్డు రంగయ్య, గట్టు నర్సింహాచార్యులు, తదితరులున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

గూడూరు : మండలంలోని బొల్లెపల్లికి చెందిన బానోతు రాంచందర్‌ను ఎదురుగా వచ్చిన లైన్ తండాకు చెందిన తేజావత్ నితిన్ అనే యువకుడు నడుపుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టగా రాంచందర్ చేయి విరిగింది. నితిన్ తలకు గాయమైంది. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి..

తొర్రూరు: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు నలమాస వీరస్వామి బుధవారం గ్రామ శివారులో కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. మోకు జారి కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

తొర్రూరు: పెరిగిన టెక్నాలజీ దెబ్బతీసిన క్రమంలో ఫొటో గ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేరుగు కరుణాకర్ అన్నారు. అసోసియేషన్ డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బుధవారం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మాచర్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి కాసర్ల రవికుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో చీడపీడలు

- కత్తెర, మొగి పురుగులతో ఆదిలోనే పంటకు నష్టం
- నివారణ చర్యలు చేపట్టాలి : నాగభూషణం, శాస్త్రవేత్త





మొక్కజొన్నకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

నర్సంపేట: తక్కువ పంటకాలం.. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ డిమాండ్ ఉండడంతో జిల్లాలోని రైతులు గతేడాది కంటే ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు. జిల్లాలో 2,82,431 సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా 1,24,136 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. వరి, పత్తి పంట తర్వాత రైతులు మొక్కజొన్నపైనే మక్కువ చూపారు. జిల్లాలోని 13 మండలాల్లో 30 వేల ఎకరాల్లో వానాకాలం మొక్కజొన్న పంట సాగు చేశారు. మొలకెత్తిన కొద్ది రోజులకే చీడపీడలు సోకి రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో కత్తెర పురుగు, మొగి పురుగు సోకి తీవ్రంగా నష్టపోయారు. మొగి, కత్తెర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే పంటపై ఆశలు వదులుకోవాల్సిందే. పంట వేసినప్పటి నుంచే సస్యరక్షణ చర్యలు చేపడితేనే ఫలితం ఉంటుంది. ప్రస్తుతం మొక్కజొన్న పంట 15 రోజుల నుంచి 30 రోజుల మధ్యలో ఉంది. చాలా ప్రాంతాల్లో పంటకు మొగిపురుగు, కత్తెర పురుగులు ఆశించి రైతులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలను వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణం వివరించారు.

కత్తెర పురుగు లక్షణాలు..

కత్తెర, మొగి పురుగులు 15 నుంచి 30 రోజుల వయసులో ఉన్న పంట పంటను ఆశిస్తాయి. ఒక్కో తల్లి పురుగు రోజుకు 1,500 నుంచి 2,000 వరకు గుడ్లు పెడుతుంది. ఒక్కో గుడ్ల సముదాయంలో 100 గుడ్లు ఉంటాయి. ఆకుల అడుగు భాగంలో గుడ్ల సముదాయాలు ఉంటాయి. పురుగులు ఆకుల పత్రహరితాన్ని తింటాయి. ఆకుల చివర నుంచి తినుకుంటూ రావడం వల్ల పంట చేను కత్తిరించినట్లు కనిపిస్తుంది. గుడ్ల నుంచి ఎదిగిన లార్వాలు మొక్కజొన్న కర్ర మొగిలో ఉండి మొగిని తింటాయి. దీంతో కర్ర ఎదుగుదల ఆగి చనిపోతుంది.

నివారణ చర్యలు..

పంట 30 రోజుల వయసులో ఉండగా లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనెతోపాటు లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్ల సైనోసాడ్ లేదా 0.4 మిల్లీలీటర్ల ఇమామెక్టిన్ బెంజియోట్ కలిపి పిచికారీ చేయాలి. ఇలా 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కత్తెర పురుగు పంట వేసింది మొదలు.. పంట పూర్తయ్యే వరకు ఆశిస్తూనే ఉంటుంది. కండెదశలో పంటపై పిచికారీ చేయడం కష్టంగా ఉంటుంది కావున ఎకరాకు 10కిలోల తౌడును 2 కిలోల బెల్లంతో పులియబెట్టి పులిసిన తర్వాత 100 నుంచి 150 గ్రాముల థయోడియోకార్బ్ మందును కలిపి మొక్కల మొదళ్ల వద్ద వేయాలి. టైకోగ్రామా గుడ్లను ఎకరాకు 50 వరకు వదిలిపెట్టాలి. ఇలా చేయడం వల్ల ఇవి కత్తెర పురుగు గుడ్లను, లార్వాలను తినేస్తాయి. ఇసుకను మొక్కల మొగిలో వేయడం వల్ల కత్తెర పురుగుకు రాపిడి జరిగి చనిపోతుంది. 30 రోజుల నుంచి 60 రోజుల మధ్య ఇలా చేస్తే ఉపయోగం ఉంటుంది.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మోకుదెబ్బ నాయకులు రమేశ్, తదితరులు

నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పాలాయి శ్రీనివాస్‌ను మోకుదెబ్బ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రమేశ్‌గౌడ్, గొడిశాల సదానందం, గంప రాజేశ్వర్, మాచర్ల ఐలుమల్లు, గోపగాని వెంకటేశ్, రామగోని సుధాకర్, శీలం వీరన్న, బొడిగే మల్లేశం, ముంజాల రాజేందర్, జూలూరి హరిప్రసాద్, మర్థ గణేశ్, జనగాం మల్లేశం, మేరుగు గంగాధర్, ముంజాల సంజీవ్, గొడిశాల మల్లికార్జున్, గంధసిరి సాంబారావు, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..



సన్మానిస్తున్న విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌ను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల రాష్ట్ర ప్రతినిధి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, విద్యావంతుల వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబరాజు మల్లేశం, ముస్లిమ్ సంఘాల ప్రతినిధి షేక్ జావిద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి గుంటి వీరప్రకాశ్, విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేశ్, దిడ్డి పార్థసారథి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నుంచి వేసిన మట్టి రోడ్డు తొలగించాలి



పర్వతగిరి : తన పంట పొలం నుంచి వేసిన రోడ్డును తొలగించాలని మండలంలోని మాల్యాతండాకు చెందిన గిరిజన రైతు జుమ్మీలాల్ ప్రభుత్వాన్ని, అధికారులను కోరాడు. మాల్యాతండా నుంచి చౌటపల్లికి వెళ్లే దారిలో ఆంజనేయస్వామి ఆలయం ఎదుట అతడి పొలం నుంచి మట్టి పోసి రోడ్డు వేయడంతో జుమ్మీలాల్ విలేకరుల ఎదుట బుధవారం కన్నీరుమున్నీరయ్యాడు. తనకున్న సుమారు ఎకరం పట్టా భూమిలో పీఆర్ కాంట్రాక్టర్ భాస్కర్‌రావు తనకు తెలియకుండా రాత్రివేళ మట్టి పోశాడని వాపోయాడు. ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తన పొలంలో పోసిన మట్టిని వెంటనే తీయించాలని వేడుకుంటున్నాడు.

పగిలిన పైప్‌లైన్... మరమ్మతులో నిర్లక్ష్యం



పగిలిన మెయిన్ పైప్‌లైన్

దుగ్గొండి : మండల కేంద్రంలో మెయిన్ పైప్‌లైన్ పగిలిపోగా మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్ ద్వారా మండల కేంద్రానికి ప్రతీరోజు మంచినీరు అందుతుండగా బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మెయిన్ పైపులైన్ పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. బస్టాండ్ సెంటర్ నుంచి పైభాగంలో ఉన్న గ్రామస్తులకు నీరు అందుతుండగా కింది భాగంలో ఉన్న గ్రామస్తులకు నీరు అందడం లేదు. ఈ విషయమై అధికారులకు సమాచారం ఇవ్వగా గ్రామ పంచాయతీలో నిధులు లేవని, తాము ఏమీ చేయలేమని అంటున్నారని గ్రామస్తులు వాపోయారు. నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా అందించాలని కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

యువజన సమస్యలు కలెక్టర్ దృష్టికి..



రాయపర్తి (వర్ధన్నపేట) : యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ సత్యశారద దృష్టికి తీసుకెళ్లినట్లు జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క బహూకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని యువత ఎదుర్కొంటున్న, గ్రామంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు.

అనాథ బాలలకు ఉచితంగా విద్యాభ్యాసం

- గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు




బాలలతో సుబ్బారావు, తదితరులు

ఖానాపురం : తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలలకు ఉచితంగా విద్యాభ్యాసం అందిస్తానని నర్సంపేటకు చెందిన గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు ప్రకటించారు. మండల కేంద్రానికి చెందిన మానేపల్లి శివ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని సుబ్బారావు బుధవారం పరామర్శించారు. శివ ఆత్మహత్య బాధాకరమన్నారు. శివ పిల్లలైన ప్రవస్తి, సాత్విక్‌లకు పదో తరగతి వరకు ఉచితంగా విద్యాబోధన అందిస్తామని తెలిపారు. తాను ఇప్పటికే మండలంలోని పలు పేద కుటుంబాల్లోని పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నట్టు చెప్పారు. అనాథ బాలలకు ఉచితంగా విద్యాభ్యాసం అందించే విషయంలో ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూకల పూర్ణచందర్, తదితరులున్నారు.

బంగారంపై రుణాలు మాఫీ చేయాలి

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బంగారంపై తీసుకున్న వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడచినా హామీలను అమలు చేయడం లేదని చెప్పారు. రుణాలను మాఫీ చేయకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అన్న లింగన్న, పవన్, కుమారస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న మల్లేశం, నాయకులు

నర్సంపేట : తెలంగాణలో వేలానికి పెట్టిన నాలుగు బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ అధికారికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం మల్లేశం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసి ఉత్పత్తి పెంచుతామనే సాకుతో ప్రైవేటీకరణకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పదో రౌండ్‌లో తెలంగాణలోని శ్రావణపల్లి, తాడిచర్ల, సత్తుపల్లి, కోయగూడెం బొగ్గు గనుల బ్లాకులను వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను వేలం వేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమా అశోక్, శివరాత్రి కుమార్, బోనగిరి రామ్మూర్తి, బోనగిరి సారయ్య, ఈర్ల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించండి



చెన్నారావుపేట : మండలంలోని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ దయాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. గ్రామాల్లో చాలా చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయిందని చెప్పారు. సరైన డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలకు మలేరియా, డెంగ్యూ, జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో వీధిలైట్లు, రోడ్లు లేక ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయాలని, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సాంబయ్య, అచ్చా నాయక్ పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి



వర్ధన్నపేట : లబ్ధిదారులతో ఎమ్మెల్యే నాగరాజు

రాయపర్తి(వర్ధన్నపేట): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కోరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో 38 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా తులం బంగారం అందించలేకపోతున్నట్లు తెలిపారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

పర్వతగిరి : సమస్యలు పరిష్కరించి సుపరిపాలన అందిస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. మండలంలోని కొంకపాకలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీటీసీ పాక శ్రీనివాస్ అధ్యక్షతన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గడీల పాలనను అంతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ బాబురావు, ఏఈ కవిత, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, ప్రత్యేక అధికారి నరేశ్, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ లీకేజీకి బాధ్యత వహించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నర్సంపేట : నీట్ పేపర్ లీకేజీకి ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్, అజయ్ మాట్లాడారు. నీట్ పరీక్షా పత్రాల లీకేజీతో 24 లక్షల మంది జీవితాలు అగమ్యగోచరమయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. ఎన్‌టీ ఏజెన్సీ యువత జీవితాలతో చెలగాటం ఆడిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగినా ప్రధాని స్పందించకపోవడం సరికాదన్నారు. వెంటనే ఎన్‌టీ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలని, మానిటరింగ్ చేయడంలో విఫలమైన క్రమంలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటస్వామి, భిక్షపతి, ఏఐకేఎంఎస్ నాయకుడు మల్లన్న, పీడీఎస్‌యూ నాయకులు రాజేశ్, ఉషా, కిరణ్, అఖిల్, శివ, ప్రశాంత్, రవి, అఖిల, పవిత్ర, పావని, శ్యామల, మహేందర్, కిరణ్, శ్యామ్, అనిల్, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



రాయపర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రాయపర్తి (వర్ధన్నపేట) : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.రాజేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కనీస వేతనాలు అందక, ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల, గౌరవ అధ్యక్షురాలు బి.నిర్మల, ఉపాధ్యక్షురాలు ఇమ్మడి అనిత, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జె.రేణుక, నాయకులు కె.అరుణ, జి.సత్యవతి, భారతి, జి.స్వరూప, పద్మలక్ష్మి, మీనా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రియాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించి కోడ్‌లుగా ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేల చొప్పున చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల, అధ్యక్ష, కార్యదర్శులు చినగారి రాణి, ఇసంపెల్లి వజ్ర, అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



రాయపర్తి : విద్యార్థులకు నోట్‌బుక్స్, టై, బెల్ట్‌లు అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

రాయపర్తి : విద్యార్థులు చదువులో రాణించాలని కొండాపురం హైస్కూల్ హెచ్‌ఎం నాగకుమారి, గ్రామానికి చెందిన అట్టపెల్లి లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. తన కుమారులైన పురుషోత్తమ్, రామప్రభు జ్ఞాపకార్థం మండలంలోని కొండాపురం హైస్కూల్ విద్యార్థులకు లక్ష్మీనారాయణ బుధవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి 700 నోట్‌బుక్కులు, 60 టైలు, బెల్ట్‌లు, 60 జతల షూ అందజేశారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడారు. తన పిల్లల జ్ఞాపకార్థం విద్యార్థులకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎం నాగకుమారి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎద్దు కొమురమ్మ, మురళి, మాజీ సర్పంచ్ దయాకర్‌రావు, యాకయ్య, ప్రసాద్, మనోజ్‌గౌడ్, రామయ్య, రావుల గంగయ్య, ఎద్దు రమేశ్, కృష్ణ, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ అన్వర్, దుర్గాచారి, శంకర్, లలిత, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామంలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఆ స్కూల్ నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు చక్రవర్తుల నాగార్జున, చందా రాజేందర్, శైలజ బుధవారం సొంత డబ్బుతో బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అలాగే స్కూల్‌కు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.